జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
శనివారం 07 03 2026
సంపుటి 1 సంచిక 105
పేజీలు : 04
PRGI No : TGTEL/25/A4195



దశ
మిమ్మల్ని అభిమానించే, మీరు కోరుకున్న వారికి, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు తెలియజేయండి.
పుట్టిన రోజు శుభాకాంక్షలు
విదేశీయానం/ స్వదేశాగమనం
ఉద్యోగ, పదవీ విరమణ
వివాహ వార్షికోత్సవం
అతి తక్కువ ధరలకే యాడ్స్
7337 54 6647
9848 28 8850


## ఆరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్



**దశ, హైదరాబాద్:** తెలంగాణలో వేసవి ప్రతాపాన్ని ముందుగానే చూపిస్తోంది. మార్చి నెల ప్రారంభంలోనే సూర్యుడు భగభగ మండుతూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. తొలిసారిగా నిన్న ములుగు జిల్లా మంగపేటలో గరిష్ఠంగా 39 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్ అర్బన్, ధర్మపురి, ఖమ్మం అర్బన్లలోనూ 38.9 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రెండ్రోజులుగా రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కన్నా 2.2 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని అధికారులు తెలిపారు.వాతావరణ శాఖ రాబోయే రోజులకు సంబంధించి కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలోని 6 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ దాటే అవకాశం ఉందని అంచనా వేసింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ అయ్యాయి. మిగిలిన 27 జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు ప్రకటించారు. ఈ వారంలో చాలా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1 నుంచి 1.5 డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని నిపుణులు పేర్కొన్నారు.



# మాదిగ బిడ్డలు కలెక్టర్లు, డాక్టర్లవ్వాలి

**మాదిగ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు**

**మాదిగ జాతి హక్కుల కోసం రాజకీయ ఒత్తిళ్లను సైతం లెక్కచేయకుండా నిలబడ్డ.**

**ఉద్యోగులే ప్రభుత్వ బ్రాండ్ అంబాసిడర్లు**

**గల్లీ నుంచి ఢిల్లీవరకు మీ హక్కుల కోసం పోరాటం చేశాం.**

**తాను అందరి వాడినన్న సీఎం**

**దశ, హైదరాబాద్** శిల్పా కళా వేదికలో జరిగిన మాదిగ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగం అత్యంత ఆసక్తికరంగా, ఉద్వేగభరితంగా సాగింది. ఈ సందర్భంగా ఆయన తనను తాను మహాభారతంలోని బార్బరీకుడి తో పోల్చుకున్నారు. బలహీనుల పక్షాన నిలబడి పోరాడే గుణం ఉన్న బార్బరీకుడి వలె, తాను కూడా అణగారిన వర్గాల కోసం, ముఖ్యంగా మాదిగ జాతి హక్కుల కోసం రాజకీయ ఒత్తిళ్లను సైతం లెక్కచేయకుండా నిలబడ్డానని ఆయన చెప్పారు. కర్ణుడు మిత్రధర్మాన్ని పాటించినట్లుగా, తాను మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని మిత్రధర్మాన్ని నెరవేర్చానని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 2023 ఎన్నికల్లో ప్రజలు మార్పును కోరుకుని ఈ ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని, తమ వద్ద అక్రమ సంపాదన లేకపోయినా కేవలం చిత్తశుద్ధితోనే గెలిచామని సీఎం గుర్తు చేశారు. గత రెండు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం జరిగిన పోరాటాన్ని

..మిగతా 2వ పేజీలో →

## తెలంగాణ ప్రజల సొమ్ము కేరళలో తగలేస్తారా?

**కేరళలో ఫుల్ పేజీ యాడ్స్‌పై హరీష్ ఆగ్రహం**

**కాంగ్రెస్ ట్రాప్ లో పడొద్దు అంటూ హెచ్చరిక**




**దశ, హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం వృద్ధులను సైతం తీవ్ర ఇబ్బందుల పాలు చేసింది అని బిఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. పెన్షన్ పెరుగుతుందని ఎదురు చూసిన వృద్ధులకు నిరాశే మిగిలిందని అన్నారు. కోట్లు ఖర్చుచేసి కేరళలో ఫుల్ పేజీ యాడ్స్ ఇవ్వడంపై హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..రూ.4,000 పెన్షన్ ఇస్తాం అని హామీ ఇచ్చి గాలికొదిలేసిందని, వికలాంగులకు పెన్షన్ పెంచడానికి చేతులు రాని సిఎం రేవంత్ రెడ్డి కు కేరళ పత్రికల్లో యాడ్స్ ఇవ్వడానికి చేతులు ఎలా వచ్చాయి? అని హరీష్ రావు ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ ను చెల్లించడం చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వం.. కేరళలో మాత్రం తమది అద్భుత పాలన అనే పబ్లిసిటీ చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ఫేక్ పబ్లిసిటీ కోసం తెలంగాణ ప్రజల సొమ్మును వాడుకుంటున్నారని, ఇతర రాష్ట్రాల్లో తగలెయ్యడానికి మీకే హక్కు ఉంది? అని ప్రశ్నించారు. తెలంగాణలో అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, కాంగ్రెస్ పార్టీ ఖాతా నుంచి కేరళ ప్రభుత్వానికి తిరిగి చెల్లించాలని, కాంగ్రెస్ ట్రాప్ లో పడొద్దని కేరళ ప్రజలకు హరీష్ రావు విజ్ఞప్తి చేశారు

## గ్రామీణ స్థానిక సంస్థలకు 14వ ఆర్థిక సంఘం నిధులు




**దశ, హైదరాబాద్:**రూ.5,060 కోట్లు విడుదల చేసింది. 15వ ఆర్థిక సంఘం తెలంగాణకు రూ.9,050 కోట్లు నిధులను కేటాయించింది. రెండు ఆర్థిక సంఘాల కింద కలిపి రూ.14,110 కోట్లను తెలంగాణకు కేటాయించింది. 14 వ ఆర్థిక సంఘం లో ₹5,060 కోట్లు.. 15 వ ఆర్థిక సంఘం లో 6,051 కోట్లు.. ఈ మొత్తం కలిపి 11,111 కోట్లు 31 డిసెంబర్, 2025 నాటికి విడుదలయ్యాయి. తాజాగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత తెలంగాణకు ఇప్పటివరకు మూడు విడతల్లో రూ.1,034.42 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. గ్రామీణ స్థానిక సంస్థలు తమ యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పిస్తే మిగిలిన నిధులను కూడా విడుదల చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది.



## ఆండాళ్ అమ్మ వారి ఊంజల్ సేవోత్సవం

శ్రీ స్వామి వారి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మ వారికి ఊంజల్ సేవోత్సవం పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం ఆలయ అర్చకులు నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. అమ్మవారికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.అమ్మవారిని ప్రధాన ఆలయ అద్దాల మండపంలో అధిష్టింపజేసి ఊంజల్ సేవోత్సవం నిర్వహించారు.

దశ ,యాదగిరిగుట్ట

## మహిళా డాక్టర్ హిట్ అండ్ రన్



**దశ, హైదరాబాద్:** గాంధీ నగర లో మహిళా కారుతో హిట్ అండ్ రన్ చేసింది. జీరా, భరత్ పెట్రోల్ పంపు వద్ద స్కూటీ నీ ఢీకొట్టి పరారైయింది. వేగంగా డ్రైవ్ చేసి స్కూటీ కి డికొట్టిన దృశ్యాలు సీసీటీవీ లో రికార్డ్ అయ్యాయి. బాధితుడు బీరం కృష్ణ తీవ్ర గాయాలతో అసుపత్రి లో చికిత్సపొందుతున్నాడు. కవాడిగూడ నుండి రాణిగంజి వైపు వెళ్తుండగా గత నెల 2న కారు ఢీకొంది. గాంధీ నగర్ పోలీసులు సీసీ టీవీ ఫూటేజీ ఆధారంగా కారు నెంబర్ ట్రేస్ చేసారు. కారు నెంబర్ టీఎస్ 08 హెచ్ఎల్ 4682 నిలోఫర్ డాక్టర్ బెక్కం విజయ నిర్మల పేరు పై రిజిస్ట్రేషన్ అయినట్లు గుర్తించారు. హిట్ అండ్ రన్ కేసు నమోదు చేయకుండా 125(a) నిర్లక్ష డ్రైవింగ్ కింద కేసు నమోదు చేసారు. హిట్ అండ్ రన్ కేసు నమోదు చేసి మహిళా డాక్టర్ ను అరెస్ట్ చేసి కారు సీజ్ చేయాలని కృష్ణ కుటుంబ సభ్యులు కోరుతున్నారు

## అపసవ్య దిశ చోదకులపై దృష్టి పెట్టండి..

**ఎల్ బి నగర్ ట్రాఫిక్ డీసీపీని కోరిన గోపీ శంకర్ యాదవ్.**



**దశ, హయత్ నగర్** : సురక్ష సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిక్కర గోపీ శంకర్ యాదవ్ శుక్రవారం ఎల్ బి నగర్ ట్రాఫిక్ డీసీపీ వరికుప్పల శ్రీనివాస్ ని కలసి పలు ట్రాఫిక్ భద్రతా అంశాలపై చర్చించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు లో ప్రధానంగా అపశ్రవ్య దిశలో వాహనాలు నడిపే వారితో నే ఎక్కువ ప్రమాదం ఉందని.. కొన్ని సందర్భాలలో ప్రాణాలు కూడా పోయే ప్రమాదం ఉందని.. ఇలాంటి వారిపై ఎక్కువగా దృష్టి పెట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. ఈ సమావేశం లో సురక్ష సేవా సంఘం క్రియాశీలక సభ్యులు పిల్లి శ్రీనివాస్ యాదవ్, నరసింహ చారి పాల్గొన్నారు.

## ప్రాణం తీసిన క్రికెట్ బెట్టింగ్

**దశ, కూకట్పల్లి:** కూకట్ పల్లి వివేకానంద నగర్ లో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేశ్వర రెడ్డి ఫ్యాన్ కి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకు న్నాడు. మెడికల్ రిప్రెజెంటివ్ గా పని చేస్తున్న వెంకటేశ్వర రెడ్డికి .భార్య ఒక కూతురు వున్నారు. గురువారం రాత్రి జరిగిన టి20 వరల్డ్ కప్ సెమీఫైనల్ మ్యాచ్లో బెట్టింగ్ పెట్టి వెంకటేశ్వర రెడ్డి ఓడిపోయాడు. బెట్టింగ్ యాప్ లో సుమారు 15 లక్షలు నష్టపోయినట్లు సమాచారం. డబ్బులు పోవడంతో తీవ్రం మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. కూకట్ పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# పంచాయతీల్లో కొత్త సర్పంచ్ వర్సెస్ పాత సర్పంచ్

**పెండింగ్ బిల్లుల చెల్లింపులకు సంబంధించి పాత సర్పంచ్‌లు, కొత్త సర్పంచ్‌ల మధ్య వాగ్వాదం.**

**అప్పులు తెచ్చి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామని..**

**కేంద్ర, రాష్ట్రాల నుంచి వచ్చిన నిధులను పెండింగ్ బిల్లులు చెల్లింపుల కింద ఇవ్వాలని పాత సర్పంచ్‌లు డిమాండ్..**



**దశ, రంగారెడ్డి :** తెలంగాణ పంచాయతీల్లో కొత్త పంచాయితీలు నెలకొంటున్నాయి. పెండింగ్ బిల్లుల చెల్లింపులకు సంబంధించి పాత సర్పంచ్‌లు, కొత్త సర్పంచ్‌ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంటోంది. తాము అప్పులు తెచ్చి డబ్బులు ఖర్చు పెట్టి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామని.. కేంద్ర, రాష్ట్రాల నుంచి వచ్చిన నిధులను పెండింగ్ బిల్లులు చెల్లింపుల కింద ఇవ్వాలని పాత సర్పంచ్‌లు డిమాండ్ చేస్తున్నారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులకే నిధులన్నీ అయితే అభివృద్ధి ఏం చేయాలంటూ కొత్త సర్పంచ్‌లు తలలు పట్టుకుంటున్నారు.తెలంగాణలో దాదాపు 2 ఏళ్ల ఆలస్యంగా గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. జనవరి నెలలోనే గ్రామాల్లో కొత్త పాలక వర్గాలు ఏర్పడి.. సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లతో పాలన సాగుతోంది. తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఆలస్యం చేయడంతో.. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయకుండా పెండింగ్‌లో ఉంచింది. ఎన్నికలు పూర్తి అయిన తర్వాత మాత్రమే వాటిని రిలీజ్ చేస్తామని తేల్చి చెప్పింది. దీంతో ఇటీవల ఎన్నికలు పూర్తై గ్రామాల్లో కొత్త సర్పంచ్‌లు వచ్చిన తర్వాత.. దశల వారీగా 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్రం విడుదల చేస్తోంది. అదే సమయంలో గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులను కేటాయిస్తోంది. ఇక్కడే ఇప్పుడు అసలు సమస్య మొదలైందిపలు విడతల్లో కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు సుమారు రూ. 1,034 కోట్ల నిధులను ఇటీవలె విడుదల చేసింది. ఇప్పుడు ఈ నిధుల గురించే.. కొత్త సర్పంచ్‌లు, పాత సర్పంచ్‌లకు మధ్య

..మిగతా 2వ పేజీలో →



# మాదిగ బిడ్డలు కలెక్టర్లు, డాక్టర్లవ్వాలి

మొదటి పేజీ తరువాయి

తాను దగ్గరుండి చూశానని, కృష్ణ మాదిగ వంటి నేతలకు అండగా నిలిచానని చెప్పారు. అసెంబ్లీలో వర్గీకరణ అంశాన్ని లేవనెత్తినప్పుడు గత పాలకులు తనను బయటకు గెంటివేసిన విషయాన్ని గుర్తు చేస్తూ.. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత వర్గీకరణను అమలు చేసిన మొదటి రాష్ట్రం మనదే కావడం గర్వకారణమని పేర్కొన్నారుప్రభుత్వ ఉద్యోగులే ఈ పాలనకు కళ్లు, చెవులని అభివర్ణించిన రేవంత్ రెడ్డి, 99 రోజుల ప్రజల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. పేదలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్ వంటి ఫలాలు అందాలంటే ఉద్యోగులు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతినెలా వెయ్యి కోట్ల రూపాయల రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సమన్వయంతో ముందుకు వెళ్తున్నామని, ఖజానాకు నిధులు చేర్చే బాధ్యత కూడా ఉద్యోగులపైనే ఉందని ఆయన స్పష్టం చేశారు.

అణగారిన వర్గాల అభివృద్ధికి విద్య ఒక్కటే మార్గమని ముఖ్యమంత్రి బలంగా ఉద్ఘాటించారు. అందుకే తాను స్వయంగా విద్యాశాఖను పర్యవేక్షిస్తూ ప్రక్షాళన చేస్తున్నానని, హాస్టల్ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచామని తెలిపారు. గత ప్రభుత్వం కుల వృత్తుల పేరుతో గొర్రెలు, బర్రెలు ఇచ్చి పాత పద్ధతుల్లోనే ఉంచాలని చూసిందని విమర్శిస్తూ.. చెప్పులు కుట్టుకున్న జాతి ఈ రాజ్యాన్ని ఏలాలి.. ఈ జాతి నుండి కలెక్టర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు రావాలి అనే తన ఆకాంక్షను వెలిబుచ్చారు. తనను రేవంత్ మాదిగ అని, రేవంత్ యాదవ్ అని, రేవంతుద్దీన్ అని ఎవరెలా పిలిచినా తనకు అభ్యంతరం లేదని.. తాను అందరి వాడినని సీఎం ప్రకటించారు. ముఖ్యమంత్రిగా వచ్చిన ఈ అవకాశాన్ని పదిమందికి సహాయం చేయడానికే ఉపయోగిస్తానని, తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. తాను సమస్యలను పరిష్కరిస్తున్నప్పుడు వెనుక నుండి జరిగే రాజకీయ దాడులను ఆపే బాధ్యతను ప్రజలే తీసుకోవాలని, మాదిగ జాతి తనకు అండగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.




# పంచాయతీల్లో కొత్త సర్పంచ్ వర్సెస్ పాత సర్పంచ్

మొదటి పేజీ తరువాయి


తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. తాము గతంలో సర్పంచ్ హోదాలో గ్రామాల్లో చేపట్టిన మౌలిక సదుపాయాలు కల్పించామని.. వైకుంఠధామాలు, డ్రైనేజీలు, క్రీడా ప్రాంగణాలు వంటి అభివృద్ధి పనులు చేసినట్లు పాత సర్పంచులు చెబుతున్నారు. ఆ పనులకు అప్పట్లో బిల్లులు రాకపోవడంతోతీసుకొచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుపోతున్నాయని పాత సర్పంచ్‌లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దాపు రూ.1,000 కోట్లకు పైగా పాత బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం విడుదలైన నిధులపై తమకే హక్కు ఉంటుందని తేల్చి చెబుతున్నారు. ఇక.. కొత్త సర్పంచ్‌లు మాత్రం వాటికి ససేమిరా అనడంతో అసలు వివాదం మొదలైంది. తాము పంచాయతీ ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చి, గ్రామాలను డెవలప్ చేస్తామని ప్రజలకు మాట ఇచ్చామని.. ఇప్పటివరకు వచ్చిన నిధులు మొత్తాన్ని పాత బకాయిలకే చెల్లిస్తే.. ఇక గ్రామాల్లో అభివృద్ధి ఎలా చేయాలంటూ ప్రశ్నిస్తున్నారుతాము అధికారంలోకి వచ్చీ రాగానే.. కేంద్రం నుంచి విడుదలైన నిధులను ఇవ్వకపోతే.. ఇక గ్రామ పంచాయతీలను ఎలా నడపాలంటూ ప్రశ్నిస్తున్నారు. గ్రామాలను అభివృద్ధి చేయడం కోసం కొత్త పనులు ప్రారంభించకుండా కేవలం పెండింగ్ బకాయిలు తీర్చడానికే తాము కొత్తగా పదవుల్లోకి వచ్చామా అంటూ కొత్త సర్పంచ్‌లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.పెండింగ్ నిధుల్లో కేంద్రం కొంత మాత్రమే విడుదల చేయడం.. అందులో చాలా వరకు పాత బకాయిలు చెల్లించడానికే ఉపయోగించడం వల్ల.. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, స్ట్రీట్ లైట్స్ వంటి అత్యవసర పనులు చేసేందుకు కూడా నిధులు లేకుండా పోతున్నాయని కొత్త సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని.. కేంద్రం నుంచి పెండింగ్‌లో ఉన్న మిగతా నిధులను కూడా త్వరగా విడుదలయ్యేలా చూడాలని తెలంగాణ గ్రామ సర్పంచుల సంఘం విజ్ఞప్తి చేస్తోంది.నిధుల విషయంలో కొత్త, పాత సర్పంచ్‌ల విషయంలో ఈ ఉద్రిక్తత తలెత్తడంతో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క స్పందించారు. గతంలో గ్రామాల్లో చేపట్టిన తాగునీరు, పారిశుద్ధ్య పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను.. తాజాగా విడుదలైన నిధుల నుంచి చెల్లించాలని మంత్రి సీతక్క స్పష్టం చేసింది. అదే సమయంలో పంచాయతీల్లో అందుబాటులో ఉన్న నిధుల్లో నుంచి గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు ఇవ్వాలని సూచించారు.

# విద్యుత్ కోతలపై ఆగ్రహం

## విద్యుత్ అధికారి కార్యాలయానికి తాళం వేసిన రైతులు

**దశ, నల్గొండ:** విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు మండిపడ్డారు. ఏకంగా విద్యుత్ కార్యాలయానికి తాళం వేసారు. ఘటన నల్గొండ జిల్లా పెద్ద అడిశర్లపల్లి మండలం అంగడిపేట స్టేజి వద్ద జరిగింది. తమ ప్రాంతంలో విద్యుత్ కోతలు విధిస్తుండడంతో పెద్ద అడిశర్లపల్లి మండలంలోని చిలకమర్రి, సురేపల్లి, రోళ్లకల్ గ్రామాల రైతులు విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడించారు. విద్యుత్ లేక పంట పొలాలు ఎండుతున్నాయని ఆగ్రహంతో ఆందోళన చేపట్టారు.





# నిత్య అన్న ప్రసాదముకు లక్ష రూపాయల విరాళం

**దశ యాదగిరిగుట్ట:** ఆంధ్ర ప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లా వెట పాలెం ప్రాంతానికి చెందిన అమటం శైలేంద్రనాథ్, పద్మావతి, షణ్ముక్ మయూర్ తదితరులు శుక్రవారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రాన్ని సందర్శించారు. నరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి నిత్య అన్న ప్రసాదము నకు రూ 1 లక్ష విరాళం అందజేసి స్వామి పట్ల తమకున్న భక్తిని చాటారు.

# సామాజిక న్యాయమే ప్రజాస్వామ్యానికి అసలైన పునాది: కుమార్ మొలుగరం

**దశ ఓయూ:** సామాజిక న్యాయం, సమానత్వం మరియు సరైన ప్రాతినిధ్యం శక్తివంతమైన ప్రజాస్వామ్యానికి పునాదులని ఉస్మానియా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ సీనియర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ కాలేజీలోని రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు - సామాజిక న్యాయం, సవాళ్లు, భవిష్యత్ కార్యాచరణ" అంశంపై శుక్రవారం ఓయూ లో జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ కుమార్ మొలుగరం మాట్లాడుతూ చారిత్రకంగా వెనుకబడిన వర్గాలకు విద్య, ఉపాధి మరియు పాలనలో సమాన అవకాశాలు కల్పించడం భారత రాజ్యాంగ లక్ష్యమని అన్నారు. రాష్ట్ర జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడం అవసరమని పేర్కొన్నారు. సదస్సులో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీలకు జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో




రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీఐఎఫ్ అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి. చిరంజీవులు వెనుకబడిన వర్గాల సాధికారతకు రాజ్యాంగపరమైన రక్షణలు అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వరరావు, ప్రొఫెసర్ ఎస్. సుదర్శన్ రావు, ప్రొఫెసర్ ఎం. స్వర్ణలత తదితర విద్యావేత్తలు బీసీ రిజర్వేషన్లపై వివిధ కోణాల్లో విశ్లేషణ చేశారు. కార్యక్రమాన్ని అసోసియేట్ ప్రొఫెసర్ డా. చలమల్ల వెంకటేశ్వర్లు నిర్వహించగా, ప్రొఫెసర్ ఎం. కృష్ణ కుమార్, డా. సబావత్ రవి తదితరులు పాల్గొన్నారు. వివిధ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, పరిశోధకులు, సామాజిక కార్యకర్తలు మరియు బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# యూపీఎస్సీలో తెలుగు విద్యార్థులకు ర్యాంకులు.

**దశ, న్యూఢిల్లీ:** దేశంలోనే అత్యున్న సర్వీసులైన UPSC CSE 2025 తుది ఫలితాలు విడుదలయ్యాయి. లక్షలాది మంది అభ్యర్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సివిల్ సర్వీసెస్ రిజల్ట్స్ శుక్రవారం మధ్యాహ్నం రిలీజ్ చేశారు. అనూజ్ అగ్నిహోత్రి యూపీఎస్సీ సివిల్స్ టాపర్‌గా నిలిచాడు.

సివిల్ సర్వీసెస్ పరీక్షలో మొత్తం 958 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. జనరల్ కేటగిరీలో 317 మంది సెలక్ట్ కాగా, ఈడబ్ల్యూఎస్ కోటా నుంచి 104 మంది, ఓబీసీ నుంచి 306 మంది, ఎస్సీ కేటగిరిలో 158, ఎస్టీ కేటగిరీ నుంచి 73 మంది పలు సర్వీసులకు ఎంపికయ్యారు. UPSC తన అధికారిక వెబ్‌సైట్‌లో సివిల్ సర్వీసెస్ పరీక్ష ఫైనల్ రిజల్ట్స్ ప్రకటించింది. అభ్యర్థులు ఇక్కడ ఇచ్చిన స్టెప్స్ ద్వారా ఫలితాలను చెక్ చేసుకోవచ్చు.అభ్యర్థులు యూపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించి వివరాలు నమోదు చేసి తమ ఫలితాలను చూడవచ్చు. ఫలితాలు విడుదలైన వెంటనే దేశవ్యాప్తంగా విజయం సాధించిన అభ్యర్థులు, వారి కుటుంబాల్లో ఆనందం నెలకొంది. ఇటీవల ఇంటర్వ్యూ నిర్వహించారు. పర్సనాలిటీ టెస్ట్ పాసైన అభ్యర్థుల మెరిట్ జాబితా తాజాగా విడుదల చేశారు. ఫలితాలు UPSC వెబ్‌సైట్‌లో http//www.upsc.gov.in లో కూడా అందుబాటులో ఉంటాయి. మార్కులనుఫలితం ప్రకటించిన తేదీ నుండి 15 రోజుల్లోపు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. UPSC సివిల్ సర్వీసెస్ పరీక్ష మూడు దశల్లో నిర్వహిస్తారు.


ఇందులో ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ ఉంటాయి. ఈ మూడు దశలను ఉత్తీర్ణులైన తర్వాతే అభ్యర్థులను సివిల్ సర్వీసెస్ కు ఎంపిక చేస్తారు. ఈసారి ఇంటర్వ్యూ ప్రక్రియ జనవరి 2026 నుండి ప్రారంభమై ఫిబ్రవరి చివరి వారం వరకు కొనసాగింది.

# క్యూర్- ప్యూర్ రీజియన్ల అడుగులు

### ఓఆర్ఆర్ ఆర్ఆర్ఆర్ మధ్య 1.10 లక్షల ఎకరాల్లో భారీ గ్రీన్‌బెల్ట్.

### రూ. 35 వేల కోట్లతో నిర్మిస్తున్న 340 కి.మీ రీజినల్ రింగ్ రోడ్డు ద్వారా 24 అర్బన్ క్లస్టర్లను అనుసంధానిస్తూ..

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం ఓఆర్ఆర్ ఆర్ఆర్ఆర్ మధ్య 1.10 లక్షల ఎకరాల్లో భారీ గ్రీన్‌బెల్ట్‌ను ఏర్పాటు చేస్తోంది. దీనిని 110 హరిత జోన్లుగా విభజించి ఆక్వా, అగ్రి బిజినెస్‌లను ప్రోత్సహించనుంది. రూ. 35 వేల కోట్లతో నిర్మిస్తున్న 340 కి.మీ రీజినల్ రింగ్ రోడ్డు ద్వారా 24 అర్బన్ క్లస్టర్లను అనుసంధానిస్తూ, కాలుష్య రహిత అభివృద్ధిని సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ చుట్టూ ఉన్న ప్రాంతాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా.. క్యూర్.. ప్యూర్.. రేర్ ప్రాంతాలుగా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తోంది. క్యూర్ ప్యూర్ రీజియన్ల మధ్యలో గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. దీని పరిధిలో అందుబాటులోకి వచ్చే లక్షా పది వేల ఎకరాల భూముల్లో చెరువులతో పాటు ఆక్వా కల్చర్, అగ్రి బిజినెస్ వంటి వ్యాపారాలను చేయవచ్చు. ఈ భూములను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో కానీ.. ప్రైవేటు, కార్పొరేటు సంస్థలకు లీజుకివ్వడం ద్వారా గానీ గ్రీనరీని పెంపొందించి ఆర్ఆర్ఆర్ లోపల భాగంలో సకాలంలో వర్షాలు కురిసేలా చర్యలు తీసుకోనున్నారు.ఓఆర్ఆర్ చుట్టూ ప్రస్తుతం అంతగా గ్రీన్‌బెల్ట్ లేకపోవడం, ఇండ్లు, పరిశ్రమలు పెరుగుతుండడంతో కాలుష్యం పెరుగుతుందని చెబుతున్నారు. ఓఆర్ఆర్ ఆర్ఆర్ఆర్ మధ్యలో గ్రీన్‌బెల్ట్ వల్ల ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగురోడ్డు మధ్య 110 ప్రాంతాలను



హరిత జోన్లుగా ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గ్రీన్‌బెల్ట్‌కు కేటాయించనున్న 1.10లక్షల ఎకరాలను 110 గ్రీన్‌జోన్లుగా విభజించనున్నారు. ఇలా విభజిస్తే.. ప్రతి 3.5 కిలోమీటర్లకు ఒక హరిత జోన్ ఏర్పాటు కానుంది. ఇందులో ఆక్వా, అగ్రి బిజినెస్, చెట్లతో ప్రతి జోన్ ప్రాణవాయువు కేంద్రంగా మార్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు.ఇక రీజినల్ రింగు రోడ్డును రూ. 35 వేల కోట్ల వ్యయంతో 340 కిలో మీటర్ల మేర నిర్మిస్తున్నారు. 24 అర్బన్ క్లస్టర్లు, 208 గ్రామాలను కనెక్ట్ చేస్తున్నారు. దక్షిణ తెలంగాణ పరిధిలో 182 కి.మీ గ్రీన్‌ఫీల్డ్ రింగ్‌రోడ్డు ప్రధాన రహదారిగా మారనుంది. ఔటర్ రింగు రోడ్డుతో పాటు చౌటుప్పల్, శివన్నగూడ, కందుకూరు, ఆమన్‌గల్, చేవెళ్ల, శంకర్‌పల్లి, సంగారెడ్డి మీదుగా వెళ్లనుంది. ఉత్తర తెలంగాణ పరిధిలో 158 కి. మీ మేర ఈ రోడ్డును నిర్మిస్తున్నారు. గజ్వేల్, సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్, యాదాద్రి, ప్రజ్ఞాపూర్, భువనగిరి మీదుగా చౌటుప్పల్ వద్ద ఈ రోడ్డు కలుస్తుంది. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయి.

# ఇండియా టుడే కాన్క్లేవ్ 2026కు కేటీఆర్‌కు ఆహ్వానం

**దశ, హైదరాబాద్:** మార్చి 13, 14 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనున్న ప్రతిష్టాత్మక 'ఇండియా టుడే కాన్క్లేవ్' సదస్సులో ప్రసంగించాలని కేటీఆర్కు ఆహ్వానం అందింది. ఈ మేరకు ఇండియా టుడే గ్రూప్ వైస్ చైర్పర్సన్ మరియు ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ఇన్‌చీఫ్ కల్లి పూరీ




ఆయనకు లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్ర పాలనా నమూనాను రూపొందించడంలోనూ, రాష్ట్రాన్ని సాంకేతికత మరియు ఆవిష్కరణలకు గ్లోబల్ హబ్గా తీర్చిదిద్దడంలో కేటీఆర్ చూపిన నాయకత్వం ఈ సదస్సుకు ఎంతో సందర్భోచితంగా ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. గత రెండు దశాబ్దాలుగా ప్రపంచ గమనాన్ని అంచనా వేస్తూ, కీలక అంశాలపై చర్చించే వేదికగా ఈ కాన్క్లేవ్ గుర్తింపు పొందింది. భిన్నమైన ఆలోచనలు, స్వేచ్ఛాయుతమైన చర్చలు మరియు సరికొత్త ఆవిష్కరణలకు ఇది వేదికగా నిలుస్తోంది. ఈ వేదికపై ప్రసంగించిన ప్రపంచస్థాయి దిగ్గజాల సరసన కేటీఆర్ చేరనున్నారు. ఇప్పటివరకు ఈ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ అధ్యక్షులు బిల్ క్లింటన్, ఏపీజే అబ్దుల్ కలాం వంటి దేశాధినేతలతో పాటు ముకేశ్ అంబానీ, ఆనంద్ మహీంద్రా, గీతా గోపీనాథ్ వంటి పారిశ్రామిక మరియు ఆర్థిక నిపుణులు ప్రసంగించారు. భారతదేశపు మారుతున్న రాజకీయ, ఆర్థిక ముఖచిత్రంపై కేటీఆర్ తన విశ్లేషణను పంచుకోవాలని ఇండియాటుడే గ్రూప్ కోరింది.